ఉద్యమకారుల ఆకాంక్షలను నెరవేర్చడమే కాంగ్రెస్ లక్ష్యం



జెండాను ఆవిష్కరిస్తున్న శ్రీకాంత్‌గౌడ్

మల్లాపూర్: తెలంగాణ రాష్ట్ర ఉద్యమకారుల ఆకాంక్షలను నెరవేర్చడమే కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వ లక్ష్యమని నాచారం డివిజన్ కాంగ్రెస్ పార్టీ డివిజన్ అధ్యక్షుడు బండారం శ్రీకాంత్‌గౌడ్ అన్నారు. తెలంగాణ రాష్ట్ర అవతరణ దినోత్సవం సందర్భంగా నాచారం బహుజన సాహిత్య అకాడమీ కార్యాలయంలో తెలంగాణ ఉద్యమకారుల జేఏసీ ఆధ్వర్యంలో జాతీయ జెండాను ఆవిష్కరించారు. అనంతరం ఉద్యమకారులను సత్కరించారు. తెలంగాణ ఉద్యమకారుల జేఏసీ చైర్మన్ నల్లా రాధాకృష్ణ, రాంకోటేశ్వర్‌రావు, ప్రేమ్‌కుమార్, రాంబాబు, క్రిష్టారెడ్డి, అమరేందర్, రామకృష్ణ, శ్రీనివాస్‌రెడ్డి, నర్సిరెడ్డి, భాస్కర్‌గౌడ్, క్రిష్ణ, రాజుగౌడ్, మధుముదిరాజ్, అశ్రు, అంజి తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా విగ్రహ ప్రతిష్ఠాపనోత్సవం



ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్‌రెడ్డిని సన్మానిస్తున్న నిర్వాహకులు

మల్కాజిగిరి: ఓల్డ్ మల్కాజిగిరిలో పురాతన ఆంజనేయస్వామి దేవాలయంలో విగ్రహాల ప్రతిష్ఠాపన, ధ్వజస్తంభ ప్రతిష్ఠాపనోత్సవం సోమవారం ఘనంగా జరిగింది. దేవాలయంలో ఆంజనేయస్వామి, గణపతి, శివలింగం, సంతోషిమాత, సుబ్రహ్మణ్యస్వామి, లక్ష్మీ, భూదేవి సహిత వేంకటేశ్వరస్వామి విగ్రహాలను ప్రతిష్ఠించారు. మల్కాజిగిరి ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్‌రెడ్డి పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈట వెంకన్న, ప్రధానదాత చింతల మల్లేష్‌గౌడ్, రాధ, హనుమయ్య, నాగరాజు, శోభన్‌బాబు, వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

యువత ఇతరులను ఇబ్బంది పెడితే కఠిన చర్యలు

ఇన్‌స్పెక్టర్ ఎలక్షన్‌రెడ్డి



ఉప్పల్: యువత పాశ్చాత్య పోకడలతో ఇతరులను ఇబ్బంది పెట్టేలా కార్యక్రమాలను నిర్వహించొద్దని ఉప్పల్ ఇన్‌స్పెక్టర్ ఎలక్షన్‌రెడ్డి హెచ్చరించారు. ఉప్పల్ భగాయత్‌లో అర్ధరాత్రి దాటిన తర్వాత కొందరు యువకులు హల్‌చల్ చేస్తున్నారని గ్రహించిన ఇన్‌స్పెక్టర్ పెట్రోలింగ్ నిర్వహించడంతో పలు ఆసక్తికర అంశాలు వెలుగులోకి వచ్చాయి. అదే సమయంలో కొందరు యువకులు రోడ్డును బ్లాక్‌చేసి బైక్‌లు అడ్డుగా పెట్టి పుట్టినరోజు వేడుకలు జరుపుతుండగా.. ఇన్‌స్పెక్టర్ అక్కడికి వెళ్లి వారిని మందలించి పంపించారు. ఈ వీడియో సోషల్ మీడియాలో వైరల్ కాగా.. ఇన్‌స్పెక్టర్ మాట్లాడుతూ.. ఉప్పల్ భగాయత్ సహా మరోచోట పబ్లిక్ ప్లేస్‌లలో ప్రజలకు ఇబ్బంది కలిగించే కార్యక్రమాలు చేపడితే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు.

'కార్యదర్శి మాటలను వక్రీకరించారు'

ఘట్‌కేసర్: తెలంగాణ సాంఘీక సంక్షేమ గురుకుల కార్యదర్శి అలుగు వర్షిణి ఓ సమావేశంలో మాట్లాడిన మాటలను వక్రీకరించారని, టీజీపీఆర్‌ఐఈఏ సంఘం రాష్ట్ర అధ్యక్షురాలు శారద అన్నారు. విద్యార్థులు ఉండే పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలనే ఉద్దేశంతో అన్న మాటలను వ్యతిరేకంగా ప్రచారం చేస్తున్నారన్నారు. పాఠశాలలు, కళాశాలలు శుభ్రం చేసేవారిని విధుల నుంచి తొలగించలేదని, నెలకు రూ. 40 వేల వేతనంతో పనిచేస్తున్నారన్నారు. డిగ్రీ ఉత్తీర్ణత సాధించిన వారికి నైపుణ్యం పెంచడానికి నూతన కోర్సులు రూపొందించారని, విద్యార్థులకు చదువుతో పాటు సైనిక శిక్షణ, యూపీఎస్సీ కోచింగ్ ఇస్తున్నామన్నారు. కొందరు స్వార్థపరులు గురుకుల ప్రతిష్ఠను దెబ్బతీసే ప్రయత్నాన్ని అడ్డుకోవాలని పిలుపునిచ్చారు.

విలీన గ్రామాల సమస్యలు పరిష్కరించండి

మేడ్చల్: నూతన మున్సిపాలిటీ ఎల్లంపేట్ మున్సిపల్ కమిషనర్ నిత్యానంద్‌ను మున్సిపల్ పరిధిలోని వివిధ గ్రామాల బీఆర్‌ఎస్ నేతలు కలిశారు. ఎల్లంపేట్‌లోని మున్సిపల్ కార్యాలయంలో కమిషనర్‌ను కలిసి సన్మానించారు. మున్సిపల్ పరిధిలో విలీనమైన గ్రామాల వారీగా సమస్యలు విన్నవించి గ్రామాల అభివృద్ధికి కృషి చేయాలని కోరారు. బీఆర్‌ఎస్ నేతలు సుదర్శన్, రాజ మల్లారెడ్డి, హరత్‌రెడ్డి, యూనుస్‌పాషా, జీవన్ తదితరులున్నారు.

ఆరోగ్య ప్రదాతలకు అగచాట్లే !



వ్యర్థాలను తొలగింపజేస్తున్న పారిశుద్ధ్య కార్మికులు

● అరకొర జీతాలతో సౌకర్యాలు లేక.. ● ఇబ్బంది పడుతున్న పారిశుద్ధ్య కార్మికులు

రామంతాపూర్ : వేకువజామున ఉదయం 3 గంటల నుంచి విధుల్లో చేరి ఉదయం నుంచి సాయంత్రం వరకు రహదారులపై వీధుల్లో పేరుకుపోయిన చెత్త, ఇతర వ్యర్థాలను శుభ్రం చేస్తూ.. ప్రజలకు పరిశుభ్రమైన వాతావరణం అందించడంలో పారిశుద్ధ్య కార్మికుల పాత్ర కీలకం. ఓ విధంగా చెప్పాలంటే ప్రజలకు ఆరోగ్యం, మంచి వాతావరణం అందించే ఆరోగ్య ప్రదాతలని వీరిని అనవచ్చు.

90 శాతం మహిళా కార్మికులే..

గ్రేటర్ హైదరాబాద్ పరిధిలోని అన్ని జీహెచ్‌ఎంసీ సర్కిల్‌లో 90 శాతం మంది మహిళలే పారిశుద్ధ్య కార్మికులుగా విధులు నిర్వహిస్తున్నారు. వీరంతా బడుగు, బలహీనవర్గాలకు చెందిన వారే. వేకువజామున ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు ఎముకలు కొరికే చలి, ఎండ, వర్షంలోనైనా పారిశుద్ధ్య కార్మికులు విధులు నిర్వహిస్తారు.

దుర్వాసన భరించి..

వర్షానికి తడిసి, కుళ్లిపోయి దుర్వాసన వస్తున్న వ్యర్థాలను తమ చేతులతో తొలగిస్తారు. గతంలో మాజీ సీఎం కేసీఆర్ వీరి సేవలను గుర్తించి పారిశుద్ధ్య కార్మికులు దేవుళ్లతో సమానమని ప్రశంసించారు. వీరంతా గత రెండున్నర శతాబ్దాలుగా కాంట్రాక్టు కార్మికులుగా కొనసాగుతూ.. ప్రభుత్వం పర్మనెంట్ చేస్తుందని ఆశతో ఎదురుచూస్తున్నారు.

నియోజకవర్గంలో 1054 మంది కాంట్రాక్ట్ కార్మికులు..

ఉప్పల్ సర్కిల్‌లో 472 మంది, కాప్రా సర్కిల్‌లో 582 మంది కాంట్రాక్టు పారిశుద్ధ్య కార్మికులు విధులు నిర్వహిస్తున్నారు.

చాలీ, చాలనీ జీతాలు

కాంట్రాక్టు పారిశుద్ధ్య కార్మికులకు జీహెచ్‌ఎంసీ ప్రతినెల రూ.18 వేల జీతం అందిస్తున్నట్లు సమాచారం. అందులో ఈఎస్‌ఐ, పీఎఫ్ మినహాయించి దాదాపు రూ.14 వేలు మాత్రమే చేతికి వస్తుంది. దుమ్ము, ధూళి దుర్గంధాలతో విధులు నిర్వహిస్తున్న పారిశుద్ధ్య కార్మికులకు ఒళ్లు నొప్పులు, శ్వాసకోశ వ్యాధులతో బాధపడుతూ వారికి వచ్చే జీతాన్ని ఎక్కువశాతం చికిత్సలకే ఖర్చు పెడుతున్నారు.

నిత్యావసరాల పెరుగుదలతో అవస్థలు..

పెరుగుతున్న నిత్యావసర సరుకుల ధరలు, వారి ఆరోగ్యానికి సంబంధించిన మందులు ఇతర ఖర్చులకు జీతం సరిపోక అనేక ఆర్థిక ఇబ్బందులకు గురౌతున్నారు. నెల జీతం రూ.30 వేలు పెంచాలని డిమాండ్ చేస్తున్నారు. దుమ్ము, ధూళిని ఎదుర్కొవడానికి మాస్కులు, చేతులు శుభ్రం చేసుకునేందుకు సబ్బులు కూడా అందజేయాలని డిమాండ్ చేస్తున్నారు.

విధులు నిర్వహించేటప్పుడు ప్రమాదాలు..

ప్రధాన రహదారిలోని రోడ్లను ఊడ్చి శుభ్రపరిచేటప్పుడు వేగంగా వచ్చే వాహనాలు పారిశుద్ధ్య కార్మికులను ఢీకొట్టి ప్రమాదాలు జరుగుతున్నాయి. గత రెండేళ్ల క్రితం అంబర్‌పేట్ ప్రధాన రహదారులు విధులు నిర్వహిస్తున్న పారిశుద్ధ్య మహిళను ఆర్టీసీ బస్సు ఢీ కొట్టడంతో ఆమె అక్కడికక్కడే ప్రాణాలు వదిలింది. అదే విధంగా ఇటీవల రామంతాపూర్ రాంరెడ్డినగర్‌లో చెత్త రోడ్లపై వేయొద్దని ఓ మహిళను పారిశుద్ధ్య కార్మికురాలు వారించినందుకు ఆ మహిళా కుటుంబసభ్యులు వచ్చి పారిశుద్ధ్య కార్మికులపై దాడికి పాల్పడ్డారు. ఇలా ప్రమాదాల భారిన వారికి రూ.50 లక్షల మేర ప్రమాద బీమాను అందించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తున్నారు.

పారిశుద్ధ్య కార్మికుల సంక్షేమానికి కృషి



ఉప్పల్ నియోజకవర్గ పరిధిలోని ఉప్పల్, కాప్రా జీహెచ్‌ఎంసీ సర్కిల్‌లో విధులు నిర్వహిస్తున్న కాంట్రాక్టు పారిశుద్ధ్య కార్మికుల సంక్షేమానికి కృషి చేస్తాం. కార్మికుల జీతాలు పెంచడంతో పాటు వారికి ఇతర సౌకర్యాలు కల్పించేందుకు సీఎం రేవంత్‌రెడ్డి, ఇతర మంత్రుల దృష్టికి తీసుకెళ్తాం. ఇతర సమస్యలుంటే క్యాంపు కార్యాలయానికి వచ్చి వారు తమ సమస్యను వివరిస్తే మంత్రుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తాను.

– బండారి లక్ష్మారెడ్డి, ఎమ్మెల్యే ఉప్పల్

నేడు అల్వాల్ పీహెచ్‌సీలో కేన్సర్ స్క్రీనింగ్

అల్వాల్: అల్వాల్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో మంగళవారం మహిళా కేన్సర్ స్క్రీనింగ్ యంత్రాన్ని ప్రారంభించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఈ కార్యక్రమానికి మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్, ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి, జిల్లా వైద్యాధికారి, స్థానిక కార్పొరేటర్లు హాజరుకానున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా కేంద్రంలో అల్ట్రాసౌండ్, ఈసీజీ సేవలు అందుబాటులో ఉంటాయని తెలిపారు.

పవర్ లిఫ్టింగ్ జాతీయ స్థాయిలో ప్రతిభ



మౌలాలి: పవర్ లిఫ్టింగ్‌లో మౌలాలీకి చెందిన యువతి వసుమతి సత్తాచాటింది. జాతీయ, రాష్ట్రస్థాయిలో పవర్ లిఫ్టింగ్ పోటీల్లో పాల్గొని పతకాలు సాధించింది. గత నెల 29 నుంచి ఈనెల 1 వరకు ఢిల్లీలో జరిగిన జాతీయస్థాయి పోటీల్లో 63 కేజీల సీనియర్ విభాగంలో పాల్గొన్న ఆమె రెండో స్థానంలో నిలిచింది. రాష్ట్రస్థాయిలో కూడా మరో పతకం సాధించి రెండు పతకాలు సొంతం చేసుకుంది. మౌలాలీలోని సికింద్రాబాద్ మైనార్టీ గురుకుల స్కూల్‌లో పీఈటీగా వసుమతి విధులు నిర్వహిస్తోంది. జాతీయస్థాయిలో సత్తా చాటడంతో స్కూల్ ప్రిన్సిపాల్ చంద్రశేఖర్ అభినందించారు.

పరిసరాల పరిశుభ్రతకు నడుం బిగిద్దాం



లక్ష్మీనగర్‌పార్కులో మొక్కలు నాటుతున్న ప్రత్యేక అధికారిణి పంకజ, కమిషనర్ శైలజ

బోడుప్పల్: నగరపాలక సంస్థ పరిధిలో పరిసరాల పరిశుభ్రతకు నడుం బిగిద్దామని బోడుప్పల్ స్పెషల్ ఆఫీసర్ పంకజ అన్నారు. సోమవారం బోడుప్పల్ ఎస్ఎస్ఎస్ గార్డెన్‌లో నిర్వహించిన 100 రోజుల కార్యాచరణ ప్రణాళిక కార్యక్రమానికి ఆమె ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. 100 రోజుల ప్రణాళికలో భాగంగా చెత్త నిర్వహణ, తాగునీటి సమస్య, డ్రైనేజీ సమస్యలు, ఆస్తిపన్ను సమస్యలు, వీధిదీపాలు, దోమల నివారణ, వనమహోత్సవం, పాడుపడిన ఇళ్లను తొలగించడం వంటి కార్యక్రమాలు చేపడుతున్నట్లు వివరించారు. కమిషనర్ శైలజ, మాజీ మేయర్ తోటకూర అజయ్‌యాదవ్, కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు పోగుల నర్సింహారెడ్డి, మేడ్చల్ నియోజకవర్గ బి– బ్లాక్ ప్రధాన కార్యదర్శి కొత్త కిశోర్‌గౌడ్ అసిస్టెంట్ కమిషనర్ శ్యామ్‌సుందర్‌రావు, డీఈ చిరంజీవులు, మేనేజర్ ప్రవీణ్, ఆర్ఐ వెంకటేశ్వర్లు, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్లు శ్రీనివాస్‌రెడ్డి, సంగీత పాల్గొన్నారు.

రౌడీషీటర్‌కు రూ. 25 వేల జరిమానా

బైండోవర్ ఉత్తర్వులు పాటించని వైనం

ఘట్‌కేసర్: బైండోవర్ ఉత్తర్వులను ఉల్లంఘించిన రౌడీషీటర్‌కు 2వ ఎగ్జిక్యూటివ్ మెజిస్ట్రేట్ స్థానిక తహసీల్దార్ సోమవారం రూ. 25 వేలు జరిమానా విధించారు. ఇన్‌స్పెక్టర్ తెలిపిన వివరాల ప్రకారం.. పట్టణానికి చెందిన కుండ్ల మధుగౌడ్‌పై ఘట్‌కేసర్ పోలీస్‌స్టేషన్‌లో 7 కేసులు నమోదు కావడంతో 2010లో రౌడీషీట్ ఓపెన్ చేశారు. అనంతరం తిరిగి నేరాలు చేయడంతో అతడిపై 4 కేసులు నమోదయ్యాయి. నవంబర్ 16, 2024న తహసీల్దార్ ఎదుట హాజరుపరచగా.. ఏడాది పాటు మంచి నడవడికతో మసులుకోవాలని నిందితుడిని ఆదేశించారు. కానీ డిసెంబర్ 18, 2024న తిరిగి అతడిపై క్రిమినల్ కేసు నమోదైంది. దీంతో మెజిస్ట్రేట్ ఉత్తర్వులు పెడచెవిన పెట్టినందుకు సోమవారం తహసీల్దార్ ఎదుట హాజరుపరచగా రూ.25 వేలు జరిమానా విధించారు.

క్రమశిక్షణ గల నాయకుడిని కోల్పోవడం బాధాకరం



నివాళులర్పిస్తున్న ఎంపీ ఈటల రాజేందర్

మల్లాపూర్: నాచారం డివిజన్‌కు చెందిన బీజేపీ రాష్ట్ర కార్యవర్గసభ్యులు దివంగత అంపాల పద్మారెడ్డి ఎంతో క్రమశిక్షణ గల మంచి నాయకుడని, ఆయనను కోల్పోవడం చాలా బాధాకరమని మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్ అన్నారు. సోమవారం నాచారం ఏఎన్‌ఆర్ గార్డెన్‌లో నాచారం డివిజన్ అధ్యక్షులు కొమ్మగల్ల నవీన్‌కుమార్ ఆధ్వర్యంలో అంపాల పద్మారెడ్డి సంస్మరణ సభను నిర్వహించారు. ఈ సభకు ముఖ్యఅతిథిగా ఎంపీ ఈటల హాజరై మాట్లాడారు. మాజీ ఎమ్మెల్యేలు ఎన్వీఎస్ఎస్ ప్రభాకర్, బేతి సుభాష్‌రెడ్డి, మహిళామోర్చా రాష్ట్ర అధ్యక్షురాలు శిల్పారెడ్డి, జిల్లా అధ్యక్షులు మల్లారెడ్డి, కార్పొరేటర్ శ్రీవాణి, రవినాయక్, రాగిరి మోహన్‌రెడ్డి, గోపాల్‌గౌడ్, బాలచందర్, మల్కా ప్రకాష్, నల్లా రాధాకృష్ణ, శ్రీకాంత్‌గౌడ్, రవీందర్‌రెడ్డి, రవికాంత్ తదితరులు పాల్గొన్నారు.

ఒక మార్పు అభివృద్ధికి మలుపు

పీర్జాదిగూడ నగరపాలక సంస్థ కమిషనర్ త్రిలేశ్వర్‌రావు



ఇందిరమ్మ ఇళ్ల మంజూరు పత్రాలను అందజేస్తున్న కమిషనర్ త్రిలేశ్వర్‌రావు

మేడిపల్లి : 'ఒక మార్పు అభివృద్ధికి మలుపు' అనే నినాదంతో రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన 100 రోజుల కార్యాచరణ ప్రణాళిక కార్యక్రమం నేటి నుంచి 10 సెప్టెంబర్ వరకు కొనసాగుతుందని, నగర ప్రజలు ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పీర్జాదిగూడ నగర కమిషనర్ త్రిలేశ్వర్‌రావు అన్నారు. తెలంగాణ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా జాతీయ జెండాను కమిషనర్ ఆవిష్కరించి, అనంతరం ర్యాలీని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. 100 రోజుల కార్యక్రమంలో భాగంగా నాలాల్లో పూడికతీత, ఇంటింటికీ చెత్త సేకరణ చేయు విధానంపై అవగాహన కార్యక్రమాలు, పట్టణ పరిశుభ్రతపై అవగాహన కలిగించేలా పలు కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. అనంతరం కార్యాలయ, పారిశుద్ధ్య కార్మికులను సన్మానించి, అర్హులైన వారికి ఇందిరమ్మ ఇళ్ల మంజూరు పత్రాలను పంపిణీ చేశారు. మాజీ మేయర్లు, మాజీ కార్పొరేటర్లు, మున్సిపల్ అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ప్రజా సమస్యలు పరిష్కరించాలని వినతి



ఎంపీ ఈటల రాజేందర్‌కు వినతిపత్రం ఇస్తున్న కార్పొరేటర్ సునీత

మౌలాలి: డివిజన్‌లో నెలకొన్న సమస్యలు పరిష్కరించాలని మల్కాజ్‌గిరి ఎంపీ ఈటల రాజేందర్‌కు స్థానిక కార్పొరేటర్ సునీతాశేఖర్‌యాదవ్ సోమవారం వినతిపత్రం అందజేశారు. డివిజన్‌లో అత్యవసరంగా చేపట్టాల్సిన పనులు, దీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న పనులు, కాలనీల్లో అంతర్గత రోడ్లు, ప్రధాన రహదారుల విషయాలను ఎంపీకి వివరించారు. తక్షణమే చొరవ తీసుకుని సమస్యలు పరిష్కరించేలా చూడాలని కోరారు. డివిజన్ పార్టీ అధ్యక్షుడు శివగౌడ్, నాయకులు వెంకటేష్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.



ఉప్పల్ మున్సిపల్ కార్యాలయ ఆవరణలో ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి

అల్వాల్‌లో మల్కాజిగిరి ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్‌రెడ్డి, కార్పొరేటర్లు





గౌతంనగర్‌లో కార్పొరేటర్ సునీతారాముయాదవ్



మల్కాజిగిరి చౌరస్తాలో మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి



జిల్లాపరిషత్ బాలుర పాఠశాల ఆవరణలో కార్పొరేటర్ శ్రవణ్

జయజయహే తెలంగాణ.. జననీ జయ కేతనం

ఉప్పల్/ మల్కాజిగిరి జోన్ పరిధిలో తెలంగాణ రాష్ట్ర అవతరణ దినోత్సవ వేడుకలు ఘనంగా జరిగాయి. సోమవారం ప్రభుత్వ, ప్రైవేటు కార్యాలయాలు, పాఠశాలలు, కళాశాలలు, రాజకీయ పార్టీల కార్యాలయాలు, బస్తీలు, కాలనీల్లో జాతీయ జెండాలను ఎగురవేశారు. అనంతరం పలువురు మాట్లాడుతూ.. ఉద్యమనేతల పోరాట పటిమ.. ఎందరో ఉద్యమకారుల బలిదానాలతో తెలంగాణను సాధించుకున్నామన్నారు. ప్రతి తెలంగాణ బిడ్డ రాష్ట్రాభివృద్ధికి పాటుపడాలని సూచించారు. ఉద్యమంలో అమరులైన వారికి నివాళులర్పించి వారి త్యాగాలను ఈ సందర్భంగా గుర్తు చేసుకున్నారు. ఉద్యమాన్ని ముందుండి నడిపించిన మేధావుల చిత్రపటాలు, విగ్రహాలకు నివాళులర్పించారు.

– ఉప్పల్/ మల్కాజిగిరి జోన్ల బృందం



ఉప్పల్ ఇందిరాగాంధీ చౌరస్తా వద్ద కార్పొరేటర్ రజితాపరమేశ్వర్‌రెడ్డి



కాప్రా మండలం తహసీల్దార్ కార్యాలయంలో..



గాంధీనగర్ ప్రభుత్వ పాఠశాలలో..



ఈసీఐఎల్ సీపీఐ కార్యాలయం వద్ద..



ఆవిర్భావ వేడుకల్లో సీపీఐ నేత యాదయ్య



వినాయక్‌నగర్‌లో..



ర్యాలీలో ప్రత్యేకాధికారి పంకజ, కమిషనర్ శైలజ



బోడుప్పల్‌లో జెండాను ఎగురవేస్తున్న మంద సంజీవ్‌రెడ్డి



అల్వాల్ మున్సిపల్ కార్యాలయంలో డీసీ శ్రీనివాస్‌రెడ్డి



అల్వాల్ రాజీవ్‌గాంధీ విగ్రహం వద్ద..